సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 5 । మార్చి । 2023



వరంగల్ అంటే ఇష్టం

పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు అంటే తనకు ఇష్టమని వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. - 8లో▸



గొట్లకొండలో యోగా కేంద్రం

నెక్కొండ మండలంలోని రెడ్లవాడ శివారు గొట్లకొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0° /19.0°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే



మహబూబాబాద్: హైదరాబాద్‌లో శనివారం వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖా మంత్రి టి.హరీశ్ రావును ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కలిశారు. మానుకోట నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని కోరినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన అభివృద్ధి వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలలు, పక్కాగృహల మంజూరు విషయంపై మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాటితో పాటు నిధులు కేటాయించాలని వివరించారు. బీఆర్ఎస్ నాయకులు మార్నెని వెంకన్న, ఖాసీం, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



మరిపెడ రూరల్: విద్యార్థినులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గరల్స్ చైల్డ్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ (జీసీఈఓ) విజయకుమారి అన్నారు. మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్మించనున్న నీటి సంపు పనులను డీఈతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మెనూ సౌకర్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. 2022–23 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ అరుణకుమారి, మరిపెడ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, కేజీబీవీ ప్రత్యేక అధికారిని చల్లూరి మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను చంపితే కఠిన చర్యలు

గూడూరు: వన్య ప్రాణులను వేటాడి చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో సురేష్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి మండలంలోని భూపతిపేట చెక్‌పోస్టు వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఓ బస్తాలో మాంసపు ముద్దలు పట్టుకొని అనుమానాస్పదంగా వెళ్తుండగా వారిని వెంబడించి పట్టుకొని పరిశీలించగా బస్తాలో అడవి జంతువు మాంసం లభించిందన్నారు. వెంటనే వారిని రేంజ్ కార్యాలయానికి తరలించి విచారించారు. వారిలో కొత్తగూడ మండలం కోనాపురం గ్రామానికి చెందిన గొట్టి అశోక్, కేసముద్రం మండలం ధనసరి గ్రామానికి చెందిన కోసాని శ్రీనాథ్‌గా గుర్తించారు. వారిద్దరు కలిసి కొత్తగూడ మండల అటవీ ప్రాంతంలో అడవి జంతువును చంపి, మాంసాన్ని కేసముద్రం మండలానికి తరలిస్తున్నామని అంగీకరించారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్: జిల్లా సంక్షేమాధికారిగా వరలక్ష్మి శనివారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీడబ్ల్యూఓగా పనిచేసిన వరలక్ష్మి ప్రస్తుతం సెలవులో ఉండగా మానుకోట జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. దీంతో శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ శశాంకను మార్యదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కేజీబీవీల్లో సమస్యలకు చెక్

మరమ్మతు, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు

- మొదటి విడతలో 4 పాఠశాలలు ఎంపిక
- జిల్లాలో 15 కేజీబీవీ పాఠశాలలు



కేజీబీవీ కేసముద్రం



సాక్షి, మహబూబాబాద్: తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలతోపాటు, బడి మధ్యలో మానేసిన వారు, నిరుపేద బాలికల చదువుకు నెలవులుగా మారిన కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో మరమ్మతుకు ప్రభుత్వం రూ. 37,30,000 నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు ఉండగా మొదటి విడతగా కేసముద్రం, తొర్రూరు, నర్సింహులపేట, మరిపెడ పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే 70 శాతం నిధులు విడుదల చేసి వచ్చే విద్యాసంవత్సరంలోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక విద్యాశాఖ, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ అధికారులను ఆదేశించారు.

మరమ్మతు, మౌలిక వసతులు

ప్రభుత్వం సమగ్రశిక్షాభియాన్ ద్వారా విడుదల చేసిన నిధులతో జిల్లాలోని నాలుగు కేజీబీవీల్లో మరమ్మతు, మౌలిక వసతులు కల్పించనున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలు చదివే కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. తాగునీరు, శానిటేషన్, విద్యుత్ సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిధులతో సమస్యలకు చెక్ పెట్టనున్నారు. ప్రధానంగా పడక గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ లైట్ల ఏర్పాటు, స్నానాలు, ఇతర అవసరాలకు నీటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ లైన్ల ఏర్పాటు, సంపులు, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాలి. ప్రవేశ ద్వారం నుంచి పాఠశాల ఆవరణం వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణ పెంచాలి. ప్రతి 15 రోజులకు స్టోరేజీ డేటాను భద్ర పర్చాలి. ప్రధానంగా సెప్టిక్ ట్యాంకులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేసి బాత్‌రూమ్స్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి కేజీబీవీలో బోర్‌వెల్ ఏర్పాటు చేయాలి. తక్కువ ఎత్తులో ఉన్న కంపౌండ్ వాల్స్‌ను ఎత్తు పెంచాలి. బడ్జెట్‌ను అనుకూలతను బట్టి కిటికీలకు దోమలు రాకుండా మెష్ ఏర్పాటు చేయాలి.

నిధుల మంజూరు ఇలా.. (రూ.లక్షల్లో)

పాఠశాల (కేజీబీవీ)	అంచనా	విడుదల (75శాతం)	విడుదల కావాల్సినవి
కేసముద్రం	9.50	7.13	2.37
మరిపెడ	9.00	6.75	2.25
నర్సింహులపేట	9.80	7.35	2.45
తొర్రూరు	9.00	6.75	2.25
మొత్తం	37.30	27.98	9.32

పాఠశాల కమిటీ పర్యవేక్షణలో..

పాఠశాలకు ఏం కావాలి.. ఏం పనులు చేయించాలి.. అన్న విషయంపై మంజూరైన బడ్జెట్ ఆధారంగా పాఠశాల పర్యవేక్షణ కమిటీ నివేదిక ఆధారంగా పనులు చేయాలి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ, బాలిక విద్యా అధికారి, పాఠశాల ప్రత్యేకాధికారి సలహాలు సూచనలను పరిగణంలోకి తీసుకొని పనులు నిర్ధారించాలి. పూర్తి నివేదికను టీఎస్ఈడబ్ల్యూఐడీసీ అధికారులు పరిశీలించాలి. పనులు నాణ్యతతో చేసేలా పర్యవేక్షించాలి. అయితే ఈ పనుల ప్రతిపాదనలు, నిర్వాహన వివరాలు తెలుసుకోవడం, నిర్ధారించడంలో కొన్ని చోట్ల ఇంజనీరింగ్ అధికారులు పాఠశాల కమిటీల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినుల అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులు ఇలా వ్యవహరించడంపై విద్యాశాఖ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఓరుగల్లు వేదికగా రాష్ట్రస్థాయి వేడుక

- మహిళా దినోత్సవం నిర్వహణకు నిర్ణయం
- కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాట్లు
- దిశానిర్దేశం చేసిన మంత్రి సత్యవతి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన హోలీకేరి, సిక్తా పట్నాయక్ తదితరులు

హన్మకొండ అర్బన్: ఓరుగల్లు వేదికగా రాష్ట్రస్థాయిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించడం గర్వంగా ఉందని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో మహిళా అధికారుల సమావేశం నిర్వహించారు. అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు 2వేల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. బందోబస్తు విషయంలో పోలీస్‌శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తిస్థాయి ప్రొటోకాల్ పాటించాలని, సర్పంచ్ నుంచి, మంత్రి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకోవాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కాకతీయ తోరణం గల షీల్డ్‌లు, పోచంపల్లి శాలువాలను వినియోగించాలని మంత్రి సూచించారు. బొకేస్ కాకుండా మొక్కలను ఇవ్వాలన్నారు. జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర పండుగను అందరూ ఇంటిపండుగగా చేసుకోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలీకేరి మాట్లాడుతూ విభిన్న శాఖల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సమావేశంలో వరంగల్ కలెక్టర్ గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మేయర్ గుండు సుధారాణి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి మహిళ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేయూ ఆడిటోరియం పరిశీలన..

కేయూ క్యాంపస్: వేడుకలను నిర్వహించతలపెట్టిన కేయూ ఆడిటోరియాన్ని అధికారులు పరిశీలించారు. వేదిక, పార్కింగ్, వేడుకలకు వచ్చేవారికి భోజనం ఏర్పాట్లు ఎక్కడ చేయాలనేది తదితర అంశాలపై చర్చించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద భోజనం ఏర్పాట్లు చేయనున్నారు. ఆ కళాశాలను కూడా సందర్శించి పరిశీలించారు.

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర గొప్పది

వరంగల్ లీగల్: సమాజ నిర్మాణంలో సగ భాగమైన స్త్రీ పాత్ర చాలా గొప్పదని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ వరంగల్ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు అధ్వర్యంలో న్యాయశాఖ, మహిళా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయశాఖ సిబ్బదికి మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

రైతులు సులువైన పద్ధతులు పాటించాలి

- డీఏఓ చత్రునాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

నెల్లికుదురు: రైతులు అధిక దిగుబడులను సాధించేందుకు సులువైన పద్ధతుల ద్వారా వ్యవసాయం సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చత్రు నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని వావిలాల, బోటి మీది తండా, శ్రీ రాజ్య గ్రామాలకు చెందిన రైతులకు వావిలాల గ్రామంలో ఓ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పిచికారీ చేసే టెక్నాలజీపై రైతులకు క్షేత్ర ప్రదర్శన శనివారం నిర్వహించారు. డ్రోన్ యంత్రం ద్వారా పురుగు మందులను ఒక ఎకరం కేవలం 10 నిమిషాల్లో పూర్తి చేస్తుందన్నారు. డ్రోన్ పిచికారీ చేయడం పంటకు సమపాళ్లలో మందు చేరుతుందని, సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రైతులు డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ముప్పిడి లక్ష్మీనారాయణ, ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ బొల్లెపల్లి శ్రీనివాస్, డైరెక్టర్ బోజ్యా నాయక్, మంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మన ఐపీఎస్.. మన రాష్ట్రానికే

- హనుమకొండకు చెందిన చైతన్యరెడ్డి తెలంగాణకే కేటాయింపు
- ఆనందంగా ఉందంటున్న తండ్రి సంజీవరెడ్డి



చైతన్యరెడ్డి

హన్మకొండ: మన ఐపీఎస్‌ను.. మన రాష్ట్ర కేడర్‌కే కేటాయించారు. సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన హనుమకొండకు చెందిన బొక్క చైతన్యరెడ్డి శిక్షణ కూడా ఇటీవల పూర్తయ్యింది. ఈ క్రమంలో ఆమెను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి కూతురు అయిన చైతన్యరెడ్డి.. సివిల్స్‌లో 161వ ర్యాంకు సాధించారు. నీటి పారుదలశాఖ లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ సివిల్స్ కొట్టాలనే పట్టుదలతో ప్ర యత్నించి లక్ష్యాన్ని చేరుకున్నారు. చైతన్యను తెలంగాణకు కేటాయించడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

సంతోషంగా ఉంది : సంజీవరెడ్డి, తండ్రి

నా కూతురు చైతన్యరెడ్డిని తెలంగాణ కేడర్‌కు ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఆమె పడిన కష్టానికి ప్రతిఫలం దక్కినట్లయ్యింది. సివిల్స్ కొట్టాలని పట్టుదలతో చదివింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించింది.

మహిళలకు వడ్డీలేని రుణాలు

- వీసీలో మంత్రి హరీశ్‌రావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

మహబూబాబాద్: మహిళా దినోత్సవం రోజున మహిళలకు రూ.650 కోట్ల వడ్డీ లేని రుణాలను అందించనున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆధ్వర్యంలో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులు జిల్లా కలెక్టర్‌లతో కంటి వెలుగు, పలు అంశాలపై సమీక్షించారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన ఆకస్మాత్‌గుండె నొప్పితో కింద పడిపోయే వాళ్లను రక్షింపచేసే ప్రక్రియను చూడగలిగామని, దానిని దృష్టిలో పెట్టుకుని సీపీఆర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రజలలో అవగాహన కల్పిస్తామన్నారు. అవగాహన కల్పించేందుకు జిల్లాకు ఐదుగురు మాస్టర్ ట్రెయినీలకు శిక్షణ ఇప్పించి పంపించడం జరుగుతుందన్నారు. ఈనెల 8న మహిళా దినోత్సవం రోజున ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళవారం ఈ కేంద్రాల్లో మహిళలకు పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని ప్రతి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచడమే కాకుండా సాధారణ కాన్పులు జరిగే విధంగా చర్యలు తీసుకోవడంపై వైద్యులను అభినందించారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. వీసీలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, పింకేష్‌కుమార్ పాల్గొన్నారు.

వేతన వెతలు

వేతనాలు రాక జేపీఎస్, మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బందులు

- అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న వైనం
- జిల్లాలో 381 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- 1,470 మంది గ్రామ పంచాయతీ కార్మికులు



మానుకోటలోని మదాపురం జీపీ కార్యాలయం

మహబూబాబాద్: నెల రాగానే వేతనం కోసం ఉద్యోగులు ఎదురుచూసే వారు ఎక్కువగా ఉంటారు. అలాంటిది రెండు నెలలుగా వేతనాలు రాక జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) నానా అవస్థలు పడుతున్నారు. వేతనాలు అంతంత మాత్రం ఉండగా అది కూడా నెలనెల రాకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి పరిస్థితి ఇలా ఉంటే మల్టీపర్పస్ వర్కర్లకు కూడా మూడు నెలలుగా వేతనాలు రాక తంటాలు పడుతున్నారు. జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా 370 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 70 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇందులో 11 మంది అవుట్ సోర్సింగ్ కింద జూనియర్ కార్యదర్శులుగా పని చేస్తున్నారు. జేపీఎస్‌కు జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు రాలేదు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పు చేసి ఇంటి అద్దె ఇతర అవసరాలు తీర్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని భారంతో సతమతం

ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శులపై పని భారం ఎక్కువగా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వాహన, ఫించన్లు ఇవ్వడం, 36 రికార్డు, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు, హరితహారం నర్సరీలు, సెగ్రిగేషన్, క్రిమిటోరియాల నిర్వాహన, క్రీడా ప్రాంగణాలు, పల్లెప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్ ఇలా చాలా రకాల పనులు పంచాయతీ కార్యదర్శులు చేయిస్తున్నారు. వాటికి తోడు పీఎస్ అటెండెన్స్ యాప్‌తో పాటు పలు యాప్‌లతో పనిభారం పెంచారన్నారు.

మూడు నెలలుగా అవస్థలు

మూడు నెలలుగా మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 461 జీపీలకు గాను 1,470 మంది గ్రామపంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారు. జనాభా ప్రాతిపదిన 500 జనాభా ఉన్న జీపీకి ఒక్కరు చొప్పున పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ.8,500 మాత్రమే ఇస్తున్నారు. అవి కూడా మూడు నెలలుగా రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై గత నెల కురవి మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముందుగా వేతనాలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వచ్చే వారంలో సర్దుబాటు చేస్తాం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వేతనాలు వచ్చే వారం నాటికి సర్దుబాటు చేస్తాం. మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాల విషయంలో కొన్ని జీపీల్లో ఇచ్చారు. మిగతా జీపీల్లో కూడా వచ్చే వారం నాటికి సర్దుబాటు అయ్యేలా చూస్తాం.

– దన్‌సింగ్, ఇన్‌చార్జ్ డీపీఓ

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సురేష్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి సి.సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ బాలికల కళాశాలల్లో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్స వం పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నా రు. విద్యార్థినులు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల గురించి తెలుసుకుని బాధ్యతతో నడుచుకుంటూ సమాజంలో మంచి పౌరులుగా నిలవలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ టౌన్ ఎస్సై దీపిక రెడ్డి, న్యాయవాది ఎస్‌కే. పాషా, కళాశాల ప్రిన్సి పాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న నాగమణి

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను డీఈఓ రామారావు శనివారం సందర్శించారు. ఈ మేరకు మన ఊరు –మన బడిలో భాగంగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం చేశారు. మెనూ ప్రకారంగా పిల్లలకు భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అదే విధంగా తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఏసీజీఈ శ్రీరాములు, ఎంఈఓ శ్రీదేవి, బీఆర్ఎస్ నేత రావుల రవిచందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకన్న, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.వై వెంకట్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సూచనలు

కురవి: మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌ను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సందర్శించారు. మన ఊరు–మనబడి పనుల నిర్వహణ, పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం బ్రేక్ ఫాస్ట్ ను పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పలు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలాజీ, ఏఎస్‌సీఎం సదయ్య, ఉపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి

దంతాలపల్లి: పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి అన్నారు. దంతాలపల్లి మండల కేంద్రంలో జెడ్పీ సెకండరీ పాఠశాలను శనివారం సందర్శించారు.

ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం వార్షిక పరీక్షల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, అప్సర్‌పాషా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ (సీబీసీఎస్) మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 6, 8, 10, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



సిబ్బందికి ప్రశంస పత్రం అందజేస్తున్న ఆర్ఎం

తొర్రూరు: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆర్ఎం జె.శ్రీలత అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లను సన్మానించారు. ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులకు ఉత్తమ సేవలందిస్తేనే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు,కండక్టర్ల పాత్ర కీలకమన్నారు.డిపో ఆదాయం పెంపుకు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ ఆర్ఎంఓ కృపాకర్,డీఎం పరిమళ,సూపరింటెండెంట్ రజిత,కండక్టర్లు,డ్రైవర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వింటర్ స్కూల్

కాజీపేట అర్బన్: కాజీపేటలోని నిట్‌లో 21 రోజుల పాటు నిర్వహించిన వింటర్ స్కూల్ శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీన్ అకాడమిక్స్, ప్రొఫెసర్ ఎన్వీ.ఉమామహేష్ పాల్గొని మాట్లాడారు. జియోస్పేషియల్ టెక్నాలజీపై అవగాహన కల్పించడంతోపాటు పరిశోధనలకు, ఆవిష్కరణలకు తోడ్పడేందుకు నిట్ వరంగల్ ఫ్యాకల్టీ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నిపుణులు, రిటైర్డ్ ఫ్యాకల్టీతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన రీసెర్చ్ స్కాలర్లకు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ నిట్ ఫ్యాకల్టీ డాక్టర్ టీ.రేష్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు పొందాలి



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్

ఎంజీఎం: ట్రాన్స్‌జెండర్లు, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలందరూ ఓటర్‌కార్డు కలిగి ఉండి ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ సూచించారు. శనివారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, ట్రాన్స్‌జెండర్స్, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలకు స్వీప్–ఓటర్ల చైతన్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా ఫామ్–6లో నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు లైలా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విచారణ

రామన్నపేట: ప్రీతి ఆత్మహత్య ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫ్‌ను పోలీసులు మూడో రోజు శనివారం సుదీర్ఘ విచారణ చేపట్టారు. శుక్రవారం 9 మంది వైద్యులను, వైద్య సిబ్బందిని విచారించిన పోలీసులు శనివారం మరో ముగ్గురి వైద్యులను విచారించారు. 16న ప్రీతి విధులు నిర్వర్తించిన డీఎంహెచ్ హౌస్ సర్జన్‌ను మరో ఇద్దరు పీజీలను విచారించి వివరాలు సేకరించారు. సైఫ్ పేర్కొంటున్న వివరాలతో పాటు వైద్యులను విచారిస్తూ పోలీసులు విచారణలో వేగం పెంచారు. ఆదివారంతో సైఫ్ కస్టడీ ముగిస్తుండంతో పోలీసులు తెల్లజామువరకు విచారణలో నిమగ్నమై విధులు నిర్వర్తిస్తున్నారు.

పోలీసులకు చేరింది..

ఫోరెన్సిక్ నివేదిక..టాక్సీకాలజీ నివేదిక

ప్రీతి ఆత్మహత్యకు పాల్పడటంలో అనస్థీషియా ఇంజక్షన్ తీసుకుందా..లేక ఇంకేదైనా కారణంతో ఈ ఘటన జరిగిందా అనే విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ఫోరెన్సిక్ నివేదికతో పాటు టాక్సీకాలజీ నివేదిక కీలకంగా మారనుంది. శనివారం పోలీసులకు ఈ రెండింటిలో ఏదో ఒక నివేదిక అందినట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని పోలీసులు బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచుతూ విచారణ సాగిస్తున్నారు.

వరంగల్ అంటే ఇష్టం

- భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న వెంకయ్యనాయుడు

నయీంనగర్: పోరాటల పురిటిగడ్డ, చారిత్రాత్మక ఓరుగల్లు అంటే తనకు ఇష్టమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం హన్మకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవ కార్యక్రమం కులపతి డాక్టర్ సిహెచ్. వి.పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల, వరంగల్ పేరు నిలబెట్టాలన్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. భారతీయ భోజనం ముఖ్యంగా గ్రామీణ భోజనం చేయాలని ఇంగ్లిష్ జంక్ ఫుడ్ ఆహారానికి అలవాటు కావద్దన్నారు. యోగా చేస్తే యోగ్యుడివి అవుతావని అనవసరంగా సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయొద్దన్నారు. రాజకీయాలు తప్పుదారి పడుతున్నాయని యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మొదటిసారి పోటీ చేసినప్పుడు కొన్ని ఓట్లే వస్తాయని ప్రజాస్వామ్యంలో నమ్మిన సిద్ధాంతంతో విశ్రమించకుండా ప్రయత్నిస్తే గెలుపు వరిస్తుందన్నారు. ఇతర భాషలు నేర్చుకోండి మన భాషను మాత్రం మర్చిపోవద్దన్నారు. ఇంగ్లిష్ భాష కళ్లద్దాల వంటిదని అద్దాలు తీస్తే ఎలా ఉంటుందో మీకే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ఎస్.వి. రమణారావు, కులపతి ఆచార్య పురుషోత్తంరెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఉపకులపతి ఆచార్య జి.దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, ఓఎస్డీ వీరవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిగ్రీ, పీజీలో ర్యాంకులు పొందిన విద్యార్థులకు వెంకయ్యనాయుడు బంగారు పతకాలను అందించి అభినందించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గొట్లకొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- శ్రీరామచంద్ర మిషన్‌కు 180 ఎకరాల భూమి వితరణ..
- యోగా గురువు కమలేశ్ డి పటేల్ దాజీకి పత్రాలు అందజేత..



దాజీకి పత్రాలు అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడ శివారు గొట్లకొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. యోగా కేంద్రం ఏర్పాటుకు అవసరమున్న భూమిని ఇచ్చేందుకు శనివారం మంత్రి ముందుకు వచ్చారు. శ్రీ రామచంద్ర మిషన్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ యోగా గురువు కమలేశ్‌డి పటేల్ దాజీతో కలిసి గొట్లకొండ గుట్టల మధ్య ఉన్న 180 ఎకరాల భూములను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమకు కుటుంబాల తరఫున వారసత్వంగా వస్తున్న భూములను కొలను వేంకటేశ్వరస్వామి ట్రస్టు, ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా మంచి పని కోసం విరాళంగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. దీనికి సంబంధించిన భూముల పత్రాలను, మ్యాప్‌లను కమలేశ్ డి పటేల్‌దాజీకి అందించామని పేర్కొన్నారు. ధ్యానంతో ఏగాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. యోగా ఒక గొప్ప జీవన విధానమన్నారు. యోగాను విశ్వవ్యాప్తం చేసి అందరికి పరివ్యాప్తం చేయాలనే సంకల్పంతోనే తమ ట్రస్టు భూములను మహాత్కార్యానికి ఇవ్వడం జరిగిందన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీరామచంద్ర మిషన్‌ను తెలంగాణలో విస్తరించాలని తలిచామన్నారు. తమ ఆలోచనలకు మంత్రి దయాకర్‌రావు ఉదారతను చాటుకున్నారని చెప్పారు. భూములను యోగా కేంద్రానికి వితరణగా ఇచ్చిన మంత్రి ఎర్రబెల్లికి, దాజీ కృతజ్ఞతలు తెలిపారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరా

- చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు
- రూ.97వేలు, మొబైల్, బైక్ స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బులను చూపుతున్న ఎస్సై రమేష్‌బాబు

కేసముద్రం: ఓ సొసైటీకి సంబంధించిన ఎరువుల గోదాంలో, చోరీకి పాల్పడిన ఓ వ్యక్తిని సీసీ కెమెరా ఆధారంగా గుర్తించి పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ధన్నసరి పీఏసీఎస్‌కు సంబంధించిన ఎరువుల గోదాంలో తలుపులు పగులగొట్టి, ఈనెల 1న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రూ.1.20 లక్షలను అపహరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులు మండలంలోని ఉప్పరపల్లికి చెందిన సకినాల సాయికుమార్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని మండల కేంద్రంలో పట్టుకుని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.97వేలు, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్సై సుధాకర్

మహాముత్తారం: వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను శనివారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం ప్రకారం మండలంలోని స్తంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిన చంద్రగిరి బొందయ్య మొదటి భార్య శంకరమ్మను ఫిబ్రవరి 22న ఇంట్లో ఉన్న ఆమెను కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- ప్రీతిది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికి హత్యే
- ఆలిండియా బంజారా సేవాసంఘ్ నిజనిర్ధారణ కమిటీ వెల్లడి



ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నిజనిర్ధారణ కమిటీ



ప్రీతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కొడకండ్ల : పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై కుటుంబ సభ్యులకే కాకుండా సమాజానికి అనేక అనుమానాలు ఉన్నాయని సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి దోషులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ప్రీతి కుటుంబానికి న్యాయంచేయాలని మాజీ మంత్రి, ఆలిండియా బంజారా సేవాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గిర్నితండలో ప్రీతి కుటుంబ సభ్యులను నిజనిర్ధారణ కమిటీ బృందంతో కలిసి ఆయన పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో ప్రీతి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ప్రధానంగా ప్రీతి ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసిందెవరు, సీసీ కెమెరా ఫుటేజీలను ఎందుకు చూపడంలేదు, ప్రాథమిక సాక్ష్యాలను సేకరించారా, నిమ్స్‌లో ప్రీతికి చికిత్స వివరాలు ఎందుకు తెలుపడం లేదని ఆయన ప్రశ్నించారు. ర్యాగింగ్ పదాన్ని వాడి చిన్నచిన్న సెక్షన్లతో తప్పించాలనే ప్రయత్నాలు మానుకోవాలని, తమ నిజనిర్ధారణ కమిటీ భావిస్తున్నందున హత్యగా కేసు విచారణ జరిపి దోషులందరిని గుర్తించి శిక్షించాలన్నారు. ప్రీతి కుటంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని తెలిపారు. సమావేశంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు చౌహాన్, గుగులోత్ వెంకన్న, బట్టు వెంకన్న చౌహాన్, ధనుంజయనాయక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా అందించాలి : బీసీ సంక్షేమ సంఘం

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌పై హత్య కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, సూపరింటెండెంట్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని, ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం గిర్నితండలో ప్రీతి కుటుంబసభ్యులను సంఘ నాయకులతో కలిసి పరామర్శించి ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య, విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ నాగరాజుగౌడ్, గుండగాని వేణు, మురళి, రాకేష్, శ్రీకాంత్, నాగార్జునలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT& HOUSE FOR SALE

■ నెహ్రూ బజార్‌కి తదుపరి లేన్‌లో 360 చ॥గజాల సెమీ కమర్షియల్ ప్లాట్ అమ్మకానికి ఉంది. మహబూబాబాద్ పట్టణంలో ఉన్న పాత ఇల్లు. మాల్స్, హాస్పిటల్స్ స్కూల్స్ దగ్గర. సెల్ నెం: 6301194093. [WA-6907]

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26777]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26775]

■ Kazipet Main Road 3 Stored building (G + 2 + Pent House) with 2800 Sft. Constructed on 107 Sq.Yds. Suitable for Business / Residence. Cell: 9160591961. [WA-3409]

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-775842]

PLOT FOR SALE

■ వరంగల్ to పరకాల మేన్‌రోడ్డుకు గూడెప్పాడ్ జంక్షన్ దగ్గర విట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా 150 Sq.Yds గల Plots కలవు. వెంటనే సంప్ర: 7780386570. [W-775839]

■ హన్మకొండలోని రెడ్డిపురం కెనాలు కట్ట దగ్గర 374 గజాల ప్లాటు అమ్మడానికి ఉంది దగ్గరలో వెర్లు ఉన్నందున కేవలం గజానికి 12,000 రూ॥లు మాత్రమే. సెల్: 9246890951. [W-775786]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26773]

SERVICES

ICE CREAMS

■ Igloo ఐస్‌క్రీమ్, అదాలత్, HNK. శుభకార్యములకు సప్లై చేయబడును. బల్క్ వెనిల 250/- బట్టర్ స్కాచ్ 350/-. డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సంప్ర: VENU 9849165892, Raju 9849375236. [WA-6905]

మ్యారేజ్ బ్యూరో

■ జ్యోతి మ్యారేజ్ బ్యూరో : పద్మశాలి, మున్నూరు కాపు, గౌడ, SC, ముత్రాసి మొదటి, రెండవ, సంబంధాలు అన్ని కులముల వారికి చూడబడును. 79897 71024, 97048 99451. [M-9122]

INVESTMENT

■ భూమి పైన పెట్టుబడి పెట్టే వారికి సువర్ణ అవకాశం, యాదగిరి గుట్టకి దగ్గరలో 242Sq. కొనండి. ప్రతినెలా అద్దె పొందండి. ఫోన్ : 9182282332. [H-787450]

CONSULTANT

■ Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24, 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

BUSINESS OFFER

■ పర్మినెంట్ బిజినెస్ పర్ట్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజ్ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ అనుభవం. ఫోన్ 9908743603 [HA-5600]

WANTED

■ కేంద్ర ప్రభుత్వం సంస్థ LIC యొక్క SBA Office లో పనిచేయుటకు Office Assistant Female above 21 yrs, అ॥ డిగ్రీ మరియు Agents అ॥ 10th, ఆపైన (M/F) కావలెను. సంప్ర॥ 9704248241, 9440120885. [WA-12814]

■ Any Qualification Fluency in English & Hindi. Office Asst & Primary Lady Teachers, P.E.T. Cont: Pavani School, Edga, HNK. Cell: 9393350567 [WA-6906]

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive / Delivery Executive, 2) Accounts Executive Relevant experience is mandatory Age 20-35 yrs, Cont: 8106112401. [W-775840]

■ కుటుంబ సమేతంగా అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. వసతి కల్పించబడును. సెల్: 9182922080 [WA-12803]

■ వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జ్‌లో పని చేయుటకు మేనేజర్స్‌గా, సూపర్‌వైజర్స్‌గా 12 గం॥ డ్యూటీ సాలరీ 10 వేలు ఇవ్వబడును. రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, RTC కండక్టర్స్, మొ॥వారికి ప్రాధాన్యత. 9391864657 [W-775819]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-502]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర: 93919 94780. [L-521]

■ నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఇంట్లో 24 గం॥లు వృద్ధున్ని చూసుకోవడానికి ఇంటిపనికి పురుషులు కావలెను. జీతం: 15 వేలు, ఫ్రీ వసతి +భోజనం. సంప్ర॥ సెల్: 9848652107 [Y-784319]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని కి3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

■ సెకు సూపర్ వైజర్స్ - 17000/-, సెక్యూర్స్ - 14000/- మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా: బాలానగర్, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్. Q: 10th-Degree, మెట్రో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఫోన్: 9885657755 [H-792981]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కుంటలో పడి విద్యార్థి మృతి



రిశాంత్ (ఫైల్)

ములుగు రూరల్(గోవిందరావుపేట): కుంటలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చల్వాయికి చెందిన అల్లం స్వాతి–స్వామి దంపతుల కుమారుడు రిశాంత్ (7) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ఉదయం 8.30 సమయంలో రిశాంత్ పాఠశాలకు చేరుకున్నాడు. తరగతి గదిలో బ్యాగ్ ఉంచి మరో విద్యార్థి వరుణ్‌తో కలిసి సమీపంలోని శంకర్‌రావు కుంటవద్దకు బహిర్భూమికి వెళ్లారు. తరగతి ఉపాధ్యాయుడు హాజరు తీసుకునే క్రమంలో రిశాంత్, వరుణ్‌లు క్లాస్‌లో లేకపోవడంతో విషయం తోటి విద్యార్థులను అడుగగా బయటకు వెళ్లారని సమాధానం చెప్పారు. ఈ క్రమంలో రిశాంత్‌తో బయటకు వెళ్లిన వరుణ్ వచ్చి రిశాంత్ కుంటలో నీటిలో మునిగాడని తెలిపాడు. ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు కుంట వద్దకు వెళ్లి బాలుడిని వెతుకగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పస్రా సీఐ శంకర్, ఎంఈఓ గొంది దివాకర్‌లు పరిశీలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరోత్తమ్‌రెడ్డి తెలిపారు.

దళితబంధు విధులనుంచి తప్పించండి

- ఎంపీడీఓ, డీపీఓకు వినతిపత్రాలు అందజేసిన కార్యదర్శులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కమలాపూర్: దళితబంధు పథకానికి సంబంధించిన విధుల నుంచి తమను తప్పించాలని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ పల్లవితోపాటు డీపీఓ జగదీశ్వర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మెయిల్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకానికి సంబంధించి ఇటీవల ఒక కొత్త యాప్ తీసుకొచ్చిందని, ఆ యాప్ ద్వారా దళితబంధు పథకంలో గ్రౌండింగ్ అయిన యూనిట్లను ఫొటోలు తీసి పంపించాలని ఆదేశించిందని తెలిపారు. కానీ ఆ యూనిట్లు స్థానికంగా కాకుండా ఎక్కడెక్కడో ఉన్నాయని, కొన్ని దళితబంధు వాహనాలను చాలా మంది లబ్ధిదారులు అమ్ముకున్నారని, మరికొందరు ఇతరులకు లీజుకు ఇచ్చారని వాపోయారు. షాప్స్ విషయానికి వస్తే ఒక్కో షాపుపై ముగ్గురు, నలుగురు చొప్పున క్లెయిమ్ చేసుకున్నారని, దీనిపై కార్యదర్శులు లబ్ధిదారులను అడిగితే వారు స్పందించడం లేదని, వాటిని తాము ఫొటోలు తీసి పంపించలేమని స్పష్టం చేశారు. ఆ విధులు తాము నిర్వహించలేమని, వినతిని రాష్ట్ర ప్రభుత్వం సహృదయంతో ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ క్యాదర్శులు శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, చైతన్య, వినీల్, కుమారస్వామి, విజయ్‌కుమార్, సాహిత్‌రెడ్డి, రాజారాం, శ్రీనివాస్, యూనీస్, భగవాన్‌రెడ్డి, సౌమ్య, శరత్, విజయ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు యోగా మహోత్సవం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్స్‌లో యోగా మహోత్సవం శనివారం రెండో రోజు కొనసాగింది. పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర హార్ట్‌ఫుల్‌నెస్ కన్వీనర్ బ్రదర్ బాబు గుర్రం ఆధ్వర్యంలో యోగాసనాలు, ముద్రలకు సంబంధించిన విషయాలను వివరించారు. నగరప్రజలు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.



యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

తయారీదారుల దోపిడీపై దృష్టి సారించాలి

- ఢిల్లీలో రూ.210, తెలంగాణలో రూ.370లకు మద్యం విక్రయం
- వినియోగదారుల మండలి ఫిర్యాదు



లీగల్ మెట్రాలజీకి ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి నాయకులు

వరంగల్: ఒకే సంస్థ తయారు చేసిన మద్యం బాటిల్‌ను ఢిల్లీలో రూ.210లకు, తెలంగాణ రాష్ట్రంలో రూ.370లకు క్వాటర్ ఓక్ స్మిత్ గోల్డ్(ఐఎంఎఫ్ఎల్)బాటిల్‌ను రెండు ప్రాంతాల్లో వేర్వేరు ధరల్లో విక్రయించడంపై లీగల్ మెట్రాలజీ చట్టం 2017 సెక్షన్ 18 (2ఎ) నుంచి 18 (51) వరకు ఉన్న పరిధిలో సత్వర చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ కోరారు. శనివారం వరంగల్ లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అనిల్‌కుమార్‌కు మద్యం తయారీదారుల దోపిడీ విధానంపై ఫిర్యాదు చేశారు. ఒకే రకమైన ఉత్పత్తి, ఒకే సంస్థతో తయారు చేసి వేర్వేరుగా ఎంఆర్‌పీ ముద్రించి అమ్మడం అనుచిత వ్యాపార పద్ధతిగా పరిగణించాలన్నారు. ఎక్కువ ధరలకు కొనుగోలు చేసిన వినియోగదారులు మోసపోతున్నారని వారి ప్రతినిధులుగా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మద్యం బార్ షాపుల్లో వివిధ రకాల మద్యం తక్కువ కొలతలతో అమ్ముతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించి జరిమానాలు వసూలు చేసినా యథాతథంగా దందా జరుగుతోందన్నారు. బార్ షాపుల్లో క్వాటర్, హాఫ్ బాటిల్స్ అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లూజ్ అమ్మకాలు అరికడితే కల్తీ మద్యం, తక్కువ కొలతల సమస్య ఉండదని వారు అనిల్‌కుమార్‌కు తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- నిందితుడిని పట్టుకున్న రైల్వేపోలీసు
- ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగింత



నిందితుడు అజిత్ దాస్



చోరీకి ప్రయత్నించిన ఎస్‌బీఐ ఏటీఎం

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి రాయితో ఏటీఎంను ధ్వంసం చేస్తుండగా రైల్వేపోలీస్ ఎం.నాగరాజు అడ్డుకుని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..బీహార్ రాష్ట్రం మధుబని జిల్లా పాండౌల్ బ్రహ్మోత్రకు చెందిన అజిత్ దాస్(28) ఇంట్లో భార్యతో గొడవ పెట్టుకుని రైలులో వరంగల్‌కు వచ్చాడు. ఈక్రమంలో చేతిలో డబ్బులు లేకపోవడంతో స్టేషన్‌లోని ఏటీఎంలో దొంగతనం చేయడానికి నిర్ణయించుకున్నాడు. రాయితో ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు తీస్తూ ప్రయత్నిస్తుండగా డ్యూటీలో ఉన్న జీఆర్పీ పోలీసు ఎం.నాగరాజు గమనించి నిందితుడిని పట్టుకుని అప్పగించినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ మేనేజర్ విలియం క్యారీ ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడిని సాయంత్రం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై హత్యాయత్నం

- పోలీసుల అదుపులో లారీ డ్రైవర్, క్లీనర్
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు



పట్టుబడిన లారీ డ్రైవర్, క్లీనర్

ఖిలావరంగల్ : ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి లేబర్‌కాలనీలోని 100 ఫీట్ల రోడ్డులో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీకి చెందిన వేముల భూపాల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఎనుమాముల మార్కెట్ సమీపంలో లారీ పార్కింగ్ స్థలం నుంచి రాత్రి 12 గంటలకు బైక్‌పై భూపాల్ ఇంటికి బయల్దేరాడు. లేబర్‌కాలనీ 100 రోడ్డు మీదుగా వస్తున్న క్రమంలో ఏపీ 01 ఎక్స్ 7829 నంబర్‌గల లారీ బైక్‌ను వెంబడిస్తూ ఢీకొట్టేందుకు యత్నించగా బైక్‌ను వదిలేసి రోడ్డుపక్కకు దూకేశాడు. తేరుకున్న భూపాల్ ఇతర లారీ ఓనర్లకు కాల్‌చేసి లారీ పట్టుకునేందుకు లారీని వెంబడించాడు. లారీ వేగంగా చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి ఫోర్ట్‌రోడ్డు, ఆర్టీఏ జంక్షన్ మీదుగా ఉర్సుగుట్ట జంక్షన్ చేరుకోగానే లారీఓనర్లు రోడ్డుకు అడ్డంగా భారీగేడ్లు పెట్టి లారీని నిలిపివేశారు. లారీని వదిలేసి డ్రైవర్ దిగి పారిపోగా క్లీనర్ పట్టుపడ్డాడు. అక్కడే పెట్రోలింగ్ గస్తీలో పోలీసులు డ్రైవర్‌ను పట్టుకున్నారు. లారీ ఓనర్లు లారీతో పాటు బీహార్‌కు చెందిన డ్రైవర్, క్లీనర్‌ను మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. బాధితుడు భూపాల్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముష్క శ్రీనివాస్ తెలిపారు.